# అస్తవ్యస్తంగా తపాలా సేవలు

- ప్రధాన పోస్టాఫీసులో కొలువుదీరిన సమస్యల తిష్ట
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఖాతాదారులు


రాయదుర్గం పట్టణంలోని ప్రధాన పోస్టాఫీసు

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అధికారులు, సిబ్బంది కొరత వెంటాడుతోంది. దీంతో ఖాతాదారులకు తపాలా సేవలు అందడం గగనంగా మారుతోంది. దాదాపు 75 వేల జనాభా ఉన్న పట్టణంలోని ఓబుళాచారి రోడ్డులో ఉన్న ప్రధాన పోస్టాఫీసులో (అద్దె భవనం) అధికారులు, సిబ్బంది కొరత కారణంగా ఖాతాదారులు, ప్రజలకు ఆశించిన మేర సేవలు అందడం లేదు. ఒక పోస్ట్‌మాస్టర్‌తోపాటు ఆరుగురు పోస్టల్ అసిస్టెంట్లు ఉండాల్సి ఉండగా, కేవలం ఇద్దరు పోస్టల్ అసిస్టెంట్లతో నెట్టుకొస్తున్న దుస్థితి ఉంది. రాయదుర్గం తపాలా సబ్ డివిజన్ పరిధిలో గత అక్టోబర్ నుంచి ఇన్‌స్పెక్టర్ పోస్ట్ ఖాళీ ఉంది. దాదాపు తొమ్మిదేళ్ల నుంచి పోస్ట్‌మాస్టర్ పోస్టు ఖాళీగా ఉందంటే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆరుగురు సిబ్బందికి (పోస్టల్ అసిస్టెంట్లు)గాను ఇద్దరు బదిలీపై కణేకల్లు, గుంతకల్లుకు వెళ్లారు. మిగిలిన నలుగురు సిబ్బందిలో ఇద్దరు తరుచూ డెప్యుటేషన్లపై గుమ్మఘట్ట, ఉడేగోళంతోపాటు ఇతర పోస్టాఫీసులకు వెళ్తుంటారు. దీంతో మిగిలిన కేవలం ఇద్దరు సిబ్బందితో ఖాతాదారులకు ఏ విధంగా సేవలందుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కేంద్ర సర్కారు తపాలా శాఖ ద్వారా పొదుపు, బ్యాంకింగ్, బీమా, రిజిస్టర్లు, మనీ ఆర్డర్లు, స్పీడ్ పోస్టు, ఆధార్ సేవలు అందించాల్సి ఉంటుంది. కాని ఇక్కడ కౌంటర్లలో సిబ్బంది కొరతతో సేవలు అందడం ఆలస్యమవుతోంది. దీనికితోపాటు సౌకర్యాలు లేమి ఖాతాదారులను వేధిస్తోంది. పోస్టాఫీసుకు వచ్చే వారు తమ ద్విచక్ర వాహనాలను నిలిపేందుకు పార్కింగ్ సౌకర్యం లేదు. పోస్టాఫీసు లోపల కూర్చుకునేందుకు టేబుళ్లు, తాగునీరు లేవని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆన్‌లైన్ సమస్యతోపాటు తరుచూ ప్రింటర్ మొరాయిస్తోంది. ముఖ్యంగా పోస్టాఫీసులోని జనరేటర్ చాలాకాలంగా పనిచేయడం లేదు. మరోవైపు గతంలో రాయదుర్గం పట్టణంలోని లక్ష్మీబజార్‌లో ఉండే పోస్టాఫీసును మూసేసి మెచ్చిరి గ్రామానికి తరలించగా, బజారు పోస్టాఫీసును ఎత్తివేసి మూడేళ్లు గడుస్తోంది. వీటిని పునఃప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా పోస్టాఫీసులో నెలకొన్న సమస్యలను తక్షణం పరిష్కరించి, అధికారులు, సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.

## క్లుప్తంగా

### రాయితీతో గడ్డి విత్తనాలు


మండలానికి సరఫరా అయిన గడ్డివిత్తనాలు

**వజ్రకరూరు:** రాయితీతో గడ్డివిత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల పశువైద్యాధికారి కృష్ణమూర్తి నాయక్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లడుతూ వజ్రకరూరు మండలానికి టన్ను గడ్డి విత్తనాలు వచ్చినట్లు తెలిపారు. గడ్డి విత్తనాలు కిలో ధర రూ.88 ఉందని, రాయితీతో రూ. 65 పోనూ రైతుకు రూ.23కు అందించనున్నట్లు తెలిపారు. ఒక రైతుకు ఐదు కిలోల గడ్డి విత్తనాలు అందించనున్నట్లు తెలిపారు.

### దశభుజ మహా గణపతికి విశేష పూజలు


పూజలందుకున్న దశభుజ మహా గణపతి

**రాయదుర్గంటౌన్:** పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహాగణపతికి ఆదివారం విశేష పూజలు జరిగాయి. ప్రతి ఆదివారం స్వామి వారికి అభిషేకం, పూజలు నిర్వహిస్తారు. స్వామి వారి దర్శనం కోసం స్థానిక భక్తులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో హాజరై, మొక్కులు తీర్చుకున్నారు.

### 31న మండల సర్వసభ్య సమావేశం

**బొమ్మనహాళ్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 31న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘునాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించనున్న సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు హాజరుకావాలన్నారు.

### అండేపల్లిలో చోరీ


దొంగలు పగులగొట్టిన బీరువా

**కంబదూరు:** మండలంలోని అండేపల్లి గ్రామానికి చెందిన ఎరుకుల తిరుపాల్ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన మేరకు.. తిరుపాల్ శనివారం సాయంత్రం ఇంటికి తాళాలు వేసుకొని నూతిమడుగు గ్రామంలో జరుగుతున్న మొహర్రం వేడుకలకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలను పగులగొట్టి, ఇంట్లోకి ప్రవేశించి, చోరీ చేశారు. ఇంట్లోని బీరువాను తెరిచి, అందులోని రెండు జతల కమ్మలు, రూ.50 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో ర్యాలీ


ఉరవకొండలో ఆషాడ దిండి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న భావసార క్షత్రియులు

**ఉరవకొండ:** ఉరవకొండలో ఆషాడ దిండి వేడుకలు సంప్రదాయబద్ధంగా ఆదివారం నిర్వహించారు. భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక విఠల్ రుక్మిణీ ఆలయం నుంచి ప్రత్యేక భజనలు చేస్తూ పట్టణ పురవీధుల్లో భావసార క్షత్రియులు ర్యాలీ చేశారు. అనంతరం విఠల్ రుక్మిణీ ఆలయంలో పాండురంగ స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక భజనలు చేశారు. భక్తులకు భవసార క్షత్రియులు అన్నదానం నిర్వహించారు.

### జొన్న పంటను ధ్వంసం చేసిన అడవిపందులు


జొన్నపంట ధ్వంసమైన దృశ్యం

**కుందుర్పి:** మండలంలోని జంబుగుంపల, బెస్తరపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో పంటలను రాత్రిళ్లు అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయని రైతులు తిప్పేస్వామి, ధనుంజయ, లక్ష్మీపతి, పాపన్న, సోమశేఖర్ మారుతి, హనుమయ్య ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేస్తున్నాయని ఏఓ మహేష్‌కు రైతులు ఆదివారం ఫిర్యాదు చేశారు. అధికారులు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని జీపుజాతా


సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు

**రాయదుర్గంటౌన్:** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి జిల్లాలో జీపుజాతా నిర్వహిస్తున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని ఏపీఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు మాట్లాడారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జీపుజాతా అనంతపురంలో ప్రారంభమై నార్పల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఉరవకొండ, కణేకల్లు, రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా ఆత్మకూరు, రాప్తాడు వరకు కొనసాగుతుందన్నారు. ప్రధానంగా ప్రభుత్వ హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులు, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలని, పాతబడిన ప్రభుత్వ హాస్టళ్లకు నూతన భవనాలు నిర్మించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో భోజన పథకం ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. జీపుజాతాలో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జున, అభిషేక్, మధు, భాను, జగన్, కార్తీక్, పవన్, రాందాసు తదితరులు పాల్గొన్నారు.

## కూడేరులో ఘనంగా చిన్న పీర్ల పండుగ


కూడేరు: ప్రత్యేక అలంకరణలో పీర్ల దేవుళ్లు

**కూడేరు:** మండల కేంద్రంలో చిన్న పీర్ల పండుగ ఘనంగా జరుగుతోంది. ఆదివారం చిన్న సరిగెత్తును భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. దస్తగిరి, కుళ్లాయి స్వామి, అంగార్‌వలి, చిన్న కుళ్లాయి స్వామి, మస్తాన్‌వలి పీర్లకు ముజావార్ మైనుద్దీన్ ప్రత్యేక అలంకరణ చేసి, ప్రత్యేక చదివింపులు చేశారు. పీర్ల దేవుళ్లను పీర్ల చావిడి నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళవారం పెద్ద సరిగెత్తు (పానకాలు) పీర్ల దేవుళ్ల అగ్ని గుండ ప్రవేశం, బుధవారం జలధి కార్యక్రమం ఉంటుందని ముజవార్ మైనుద్దీన్ తెలిపారు.

**ముగిసిన మొహర్రం వేడుకలు**

**కుందుర్పి:** మండలంలోని జంబుగుంపల్లో శని ఆదివారాల్లో నిర్వహించిన మొహర్రం వేడుకలు ఘనంగా ముగిశాయి. శనివారం పెద్దసరిగెత్తు, ఆదివారం జలధి ఉత్సవాలు కనుల పండువగా నిర్వహించారు. ఎంపీపీ కలమలమ్మ సొంతూరు జంబుగుంపలలో మొహర్రం వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. జంబుగుంపల్లో నిర్వహించి మొహర్రం వేడుకల్లో స్థానిక సర్పంచ్ గంగాధర, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి తదితరులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ తిప్పేస్వామి, మహేంద్ర, మాజీ డీలర్ నాగరాజు, మాజీ వార్డు మెంబర్ గోవిందు, మండల డీలర్ల సంఘం అధ్యక్షులు ఈ.రాము తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఈతో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం

- వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు,సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

**అనంతపురం మెడికల్:** నిరంతర వైద్య విద్య (సీఎంఈ)తో నూతన ఆవిష్కరణలకు ఆస్కారం ఉంటుంది. ప్రతి ఒక్కరూ నిత్య విద్యార్థిగా ఉండాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు పేర్కొన్నారు. ఆదివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో సామాజిక వైద్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జోనల్ సీఎంఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సామాజిక వైద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ సీఎంఈ ద్వారా వ్యాధుల నిర్మూలనకు ఉపయోగపడే అంశాలను తెలుసుకోవచ్చన్నారు. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ.. జోనల్ సీఎంఈను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కర్నూలు ఆస్పత్రి వైద్యురాలు డాక్టర్ సుధాకుమారి, జోనల్ డబ్ల్యూహెచ్ఓ సర్వేలెన్స్ అధికారి డాక్టర్ భవాని, డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ మహేష్ ప్రసంగించారు. సామాజిక వైద్య శాస్త్ర విభాగ అధినేత డాక్టర్ టీ మధు మాట్లాడుతూ.. 8 వైద్య కళాశాలల నుంచి 150 మంది పోస్టు గ్రాడ్యుయేట్స్ హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో పులివెందుల వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి, అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ నవీన్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, ఫిజియాలజీ విభాగం వైద్యురాలు డాక్టర్ సరళ తదితరులు పాల్గొన్నారు.

## కురుబలు సంఘటితం కావాలి


నూతనంగా ఎన్నికైన కురుబ సంఘం సభ్యులు

**బొమ్మనహాళ్:** కురుబలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయం రంగాల్లో అభివృద్ధి కోసం సంఘటితం కావాలని కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్కే మల్లికార్జున అన్నారు. ఆదివారం ఉద్దేహాళ్ గ్రామంలోని ఈశ్వర దేవాలయ ఆవరణలో కురుబ సంఘం నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా హనుమంతరెడ్డి, అధ్యక్షుడిగా కే. నాగరాజు, ఉపాధ్యక్షులుగా లేపాక్షి, రాతింటి వన్నూరుస్వామి, జనరల్ సెక్రటరీగా ఎంఆర్సీ మల్లన్న, కోశాధికారిగా ఎర్రిస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాలాక్షి, సభ్యులుగా రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు పరమేష్, కురుబ సంఘం నాయకులు బసవరాజు, డాక్టర్ బసప్ప, ఉద్దేహాళ్ శివ, గాలి బసప్ప, లాలుస్వామి, గాధిలింగ, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్ ట్యాంకుకు నీటి పంపింగ్ ప్రారంభం


కణేకల్లు శివారులో ఎస్ఎస్ ట్యాంకుకు నీటి పంపింగ్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**కణేకల్లు:** పట్టణ ప్రజల దాహార్తి తీర్చే సమ్మర్ స్టోరేజీ ట్యాంకుకు ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ఆదివారం నీటి పంపింగ్ ప్రారంభించారు. హెచ్చెల్సీకి ఈనెల 22న నీటి విడుదల చేసిన విషయం విదితమే. దీంతో ఎమ్మెల్యే కాలువ మున్సిపల్ చైర్‌పర్సన్ పోరాలు శిల్ప, డీఈఈ సురేష్‌తో కలిసి సంప్రదాయంగా గంగ పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు శారదమ్మ, ప్రశాంతి, శ్రీలక్ష్మి, గోవిందరాజులు, మాజీ కౌన్సిలర్లు టంకశాల హనుమంతు, కడ్డీపుడి మాబుబాషా, బండి భారతి, పోరాళ్ల పురుషోత్తం, స్థానిక టీడీపీ నాయకులు ఆనంద్, చంద్రశేఖర్‌గుప్త, గరికపాటి బసవరాజు, చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## నదుల అనుసంధానంతో నీటి సమస్య పరిష్కారం

**అనంతపురం కల్చరల్:** అనేక దశాబ్దాలుగా అనంతకు జరుగుతున్న అన్యాయాలు, నీటి సమస్యలపై హృద్యమైన కవిత్వాన్ని వెలువరిస్తున్న మల్లెల అభినందనీయుడని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సీనియర్ కవి మల్లెల నరసింహమూర్తి రచించిన 'మట్టి తంబూర' 'మాకూ ఒక నది కావాలి' కవితా సంపుటాల ఆవిష్కరణ జరిగింది. సమావేశానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించారు. విమలాశాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుప్రసిద్ధ విమర్శకుడు లక్ష్మీనరసయ్య, కవి, జర్నలిస్టు డాక్టర్ బండారు ప్రసాదమూర్తి, మరో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణ స్వామి తదితరులు హాజరయ్యారు. విమలశాంతి శాంతి సమితి వ్యవస్థాపకుడు, వైఎస్సార్ జీవనసాఫల్య పురస్కార గ్రహీత శాంతి నారాయణ మాట్లాడుతూ.. 'జలస్వప్నం' పేరుతో మల్లెల నరసింహమూర్తి నీటిపై రాసిన కవిత్వంతోనే ఎంతో మందిని ఆలోచింపజేశారన్నారు. తరాలుగా రాయలసీమ నీళ్ల, నిధుల లేమితో కన్నీటి జీవనం సాగిస్తోందని, గోదావరి కావేరీ నదుల అనుసంధానంతోనే సమస్య పరిష్కారమవుతుందన్నారు. గోదావరిలోకి 11 టీఎంసీల నీరు వృథాగా పోతున్నా ప్రభుత్వాల్లో చలనం లేదన్నారు. అంతకు కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు, వివిధ సాహితీ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### మానవత్వం చాటుకున్న ఎస్ఐ

**కుందుర్పి:** మండలంలోని జంబుగుంపల పంచాయతీ కెంచంపల్లికి చెందిన వన్నూరప్ప అనే యువకుడు ప్రమాదవ శాత్తూ ద్విచక్ర వాహనంపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. అదేసమయంలో మొహర్రం వేడుకల బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటకటస్వామి గాయపడిన వన్నూరప్పను తన వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించి, అత్యవసర చికిత్సలు చేయించారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ


మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**అనంతపురం:** పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం (ఎస్కేయూ క్యాంపస్) ప్రిన్సిపాల్ మార్కండేయులు సూరి అన్నారు. ఆదివారం నూతన జాతీయ విద్యా విధానం -2020లో భాగంగా శిక్షా సప్తాహ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'ఎకో క్లబ్స్ ఫర్ మిషన్ లైఫ్ డే'లో విద్యార్థిని, విద్యార్థులు మొక్కలు నాటాలన్నారు. వీటి సంరక్షణ బాధ్యతను పాఠశాలలో పిల్లలే చూసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు 'ఏక్ పేడ్ మాకే నామ్' కు స్పందించి కేంద్రీయ విద్యాలయంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు.

### 'పాలన చేతగాక పత్రాలు విడుదల చేస్తారా?'

**అనంతపురం ఎడ్యుకేషన్:** అలివిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం పాలన చేయలేక పత్రాలు విడుదల చేస్తోందని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ మండిపడ్డారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నాడు ఖజానాలో రూ.100 కోట్లు ఉన్నప్పుడు వైఎస్ జగన్ ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. ప్రజలకు 'ఇచ్చిన మాట తప్పాల్సి వస్తే పదవి వదలి వెళ్లిపోతాను' అని వైఎస్ జగన్ చెప్పినట్లు గుర్తు చేశారు. ఈ రోజు ఖజానాలో నిధులు ఉన్నా ఎందుకు పాలన చేయలేక పోతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం విపరీతమైన అప్పులు చేసి శ్రీలంక అయిపోయిందని చెప్పిన మీరే కదా ప్రజలకు హామీ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో చంద్రబాబు, లోకేష్ కొన్ని పథకాలను వాయిదా వేయడం అన్ని పథకాలను కుదించడం చూస్తే అభివృద్ధిని వాయిదా వేయడమే అన్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ కూడా పెట్టలేని దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వంలో పథకాల క్యాలెండర్‌కు అలవాటు పడిన ప్రజలు జగన్‌ను గుర్తుకు తెచ్చుకుంటున్నారని తెలిపారు. రెండు నెలల కాలంలో పింఛన్లు మినహాయిస్తే ఎలాంటి సంక్షేమ, అభివృద్ధి జరగలేదన్నారు.

# వర్షంకోసం రైతుల ఎదురుచూపు


గంజికుంట వద్ద సాగుచేసిన కంది పంట


బెళుగుప్ప సమీపంలో అరకొర తేమలోనే కంది సాగు చేస్తున్న రైతు

**వజ్రకరూరు:** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లోని రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటతోపాటు కంది, ఆముదం తదితర పంటలను సాగుచేశారు. ప్రస్తుతం ఆశించిన మేర వర్షం కురవలేదు. అప్పుడప్పుడు చిరుజల్లులు పడుతున్నాయి. భూమిలో రోజురోజుకూ తేమ శాతం తగ్గుతుండటంతో సాగు చేసిన పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**అరకొర తేమలోనే కంది సాగు**

**బెళుగుప్ప:** మండలంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి సకాలంలో వర్షాలు కురవలేదు. సీజన్ ముగుస్తోందని, అదునులో పదునైన వర్షాలు కురవలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న చిరుజల్లులకే రైతులు కొందరు విత్తన సాగు చేస్తున్నారు. మండలంలోని గ్రామాల్లో ఖరీఫ్‌లోనే సుమారు 14,000 హెక్టార్లలో ప్రధాన పంట అయిన వేరుశనగ సాగు చేసేవారు. అయితే వేరుశనగతో తీవ్ర నష్టాలను చవిచూసిన రైతాంగం ఖరీఫ్‌లో ప్రత్యామ్నాయంగా కంది, ఆముదం, పెసర, మినుము లాంటి పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ విత్తనసాగు ముగిసిన నేపథ్యంలో అదునులోనే సాగుచేస్తే మంచి దిగుబడులతో పంటను పండించాలన్న ఆశతో రైతన్నలు అరకొర తేమలోనే విత్తనాలను విత్తుతున్నారు. మండల పరిధిలో ఇప్పటివరకు ఖరీఫ్‌లో ప్రధాన పంటలుగా కంది 3వేల హెక్టార్లు, ఆముదం 900 హెక్టార్లు, వేరుశనగ 1,600 హెక్టార్లు, నీటి తడుల కింద 1,200 హెక్టారలో మొక్కజొన్న, చిరుధాన్యాలు, పెసర, మినుము లాంటి పంటలతో కలిపి ఇప్పటివరకు సుమారు 7,000 హెక్టార్లలో రైతులు పంటలు సాగు చేశారని వ్యవసాయాధికారులు చెప్తున్నారు.

### నీలగిరిస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


వజ్రకరూరులో అలంకరణలో నీలగిరిస్వామి

**వజ్రకరూరు:** స్థానిక కురుబవీధిలోని నీలగిరి స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు, ఆకుపూజ, మహా మంగళహారతి, తీర్థప్రసాదవినియోగం, విశేష పూజలు, ప్రత్యేక అలంకరణ తదితర పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

### ప్రభుత్వాస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి

- వైద్య,ఆరోగ్య శాఖ మంత్రికి బీజేపీ నేతల వినతి

**కళ్యాణదుర్గం:** నియోజకవర్గ కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, ఆస్పత్రిలో సేవలు మెరుగుపర్చాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ముప్పూరి దేవరాజ్ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు విన్నవించారు. ఆదివారం అనంతపురానికి వచ్చిన మంత్రిని దేవరాజ్ కలిశారు. ఆస్పత్రిలో అసంపూర్తిగా ఉన్న నూతన భవనం పనులు, డ్రింకింగ్ వాటర్, మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని కోరారు.

### 108 వాహనంలో ప్రసవం


మౌనిక కుటుంబ సభ్యులకు బిడ్డను అందిస్తున్న 108 వాహన సిబ్బంది

**బొమ్మనహాళ్:** కణేకల్లు మండలం రచ్చుమర్రి గ్రామానికి చెందిన మౌనిక అనే మహిళ 108 వాహనంలో ప్రసవించింది. రచ్చుమర్రి గ్రామానికి చెందిన మౌనిక నిండు గర్భిణి. ఆదివారం అర్ధరాత్రి 12.30 గంటలకు పురిటి నొప్పులు వచ్చాయి. 108 వాహన సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 2 నిమిషాలకే బొమ్మనహాళ్ 108 వాహనం మౌనిక ఇంటి వద్దకు చేరుకుంది. మౌనికను 108 వాహనంలో కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గంమధ్యలో నొప్పులు అధికమయ్యాయి. 108 పైలెట్ అంబులెన్స్‌ను రోడ్డు పక్కన ఆపారు. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం అదే 108 వాహనంలోనే తల్లీబిడ్డను కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. 108 వాహన సిబ్బందికి మౌనిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

### నేడు సర్వసభ్య సమావేశం

**రాయదుర్గం (డి హీరేహాళ్):** మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు డీహీరేహాళ్ ఎంపీడీఓ రఘునాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు.

### మంత్రి పయ్యావులను కలిసిన ఎస్పీ


మంత్రి కేశవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

**ఉరవకొండ:** రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసానికి ఎస్పీ వెళ్లి కలిసి, పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం జిల్లాలో శాంతిభద్రతలపై మంత్రితో ఎస్పీ చర్చించారు.

### ట్యాంకర్లతో తాగునీరు సరఫరా


రేణుమాకుపల్లిలో ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేస్తున్న సర్పంచ్

**ఉరవకొండ:** మండలంలోని రేణుమాకులపల్లిలో నెల రోజులుగా తాగునీరు అందక ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీంతో అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో వైఎస్సార్‌సీపీ నాయకుడు, సర్పంచ్ బోయ రామాంజనేయులు తన సొంత డబ్బుతో తాగునీటి ట్యాంకర్ల ఏర్పాటు చేసి గ్రామస్తుల దాహార్తి తీర్చారు. ఆదివారం ఎస్సీ, బీసీ, ఇందిరమ్మ కాలనీల్లో ట్యాంకర్లు ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేయించారు.

### నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**బెళుగుప్ప:** మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లోనూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు కలిసి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రీవెన్స్ ఉంటుందన్నారు.